అభివృద్ధి పనులు చేపట్టాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కొడంగల్‌లోని గురుకుల పాఠశాల భవన సముదాయం, అంగడిరైచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిశీలన
- అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులకు ఆదేశాలు, పలు సూచనలు

ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, ఫిబ్రవరి 4 : కడా పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కడా కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పనులు చేపట్టే క్రమంలో సంబంధిత శాఖల అధికారులు ఉమ్మడి సర్వేలు చేపట్టి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, నీటి సరఫరా నిలిపివేసే క్రమంలో ముందస్తుగా మీడియా ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాల మరమ్మతులతోపాటు విద్యుత్, పెయింటింగ్ పనులు చేపట్టి భవనాలను తీర్చిదిద్దేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, మండల సమీకృత భవనాలు, ప్రహరీ, అదనపు తరగతి గదుల వంటి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన రూ.5లక్షల లోపు సీసీ రోడ్డు పనులను చేపట్టాలని, అదేవిధంగా గ్రామ కూడళ్లలో నాణ్యమైన హైమాస్ట్ వీధి దీపాలు సమకూర్చాలని తెలిపారు. పట్టణంలో నిర్మించే మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల స్థలాన్ని, భవన నమూనా మ్యాపులను పరిశీలించారు. పనుల నిర్మాణంపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలను అందించారు.

సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, ఈఈ చల్మారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలావతి, ఆయా శాఖల అధికారులు, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన మరమ్మతులు చేపట్టాలి

మండలంలోని అంగడిరైచూర్ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఇన్‌పేషంట్ వార్డు, లాబొరేటరీ, మందుల నిల్వ గదితో పాటు ఔట్ పేషంట్, ఏఎంసీ తదితర రికార్డులను తనిఖీ చేశారు. భవన లీకేజీలను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి సౌకర్యాలు, వైద్య పరిస్థితులపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, లైట్లు, ఫ్యాన్స్ వంటి సౌకర్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరం మేరకు వాటిని సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 7 ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాలకు సరఫరా కాబడే మందుల వివరాలను సిబ్బంది పని తీరు వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, వైద్యులు డా.బుస్రా, డా.జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

వికారాబాద్ : భూ సమస్యలతో పాటు ఇతర సమస్యలపై అవగాహన కల్పించుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో నూతనంగా విధుల్లో చేరిన 34 మంది జూనియర్ అసిస్టెంట్‌లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూలో పని చేయడమంటే చాలా బాధ్యతతో కూడుకొని ఉంటుందన్నారు. రెవెన్యూ ఒక్కటే కాదు.. ఇతర శాఖలు, తెలంగాణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ సమస్యలుంటేనే ప్రజలు వస్తారని, వారు ఎందుకు వచ్చారు? ఏ సమస్య ఉన్నది, అన్ని వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకొని ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. సీసీఎల్ఏ రూల్స్, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాల్లో అవగాహన కలిగి ఉండాలని, ప్రజల సమస్యలను సానుకూలతతో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ (రిటైర్డ్) సురేశ్ పొద్దార్ రెవెన్యూ రికార్డ్స్, ఫైల్ సిస్టం, ఇనాం, ప్రభుత్వ భూమి, క్లెయిమ్స్, అభ్యంతరాలు, భూ రికార్డులు, తెలంగాణలోని వివిధ చట్టాల అమలు తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఏవో ఫర్హానా, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి..

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ఈ నెల 6 నుంచి మండలాలవారీగా కార్యకర్తల సమావేశాలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 : అందమైన అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ అబద్దాలతోనే కాలం వెళ్లదీస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మండలాల బీఆర్ఎస్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి మహిళలకు ఫ్రీ బస్సు మాత్రమే అమలు చేయగలిగిందని చెప్పారు. బస్సుల సంఖ్య తగ్గించడంతో ఆ బస్సులు సిగపట్లకు వేదికలుగా మారాయని, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే వంట గ్యాస్, రెండు లక్షల రుణమాఫీ సగం మందికి కూడా సక్రమంగా అందటంలేదని దుయ్యబట్టారు. అరకొరగా అమలైన వీటిని సంపూర్ణంగా అమలు చేసినట్టు చెప్పుకోవటం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ పాలనలో విడుదల చేసిన రూ.7600 కోట్ల రైతు బంధు నిధులు గత పార్లమెంట్ ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా రైతు భరోసా నిధులు ఇవ్వలేదన్నారు. రెండుసార్లు రైతు భరోసా నిధులు ఎగ్గొట్టి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం పథకాల పేరిట నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. నాట్లప్పుడు ఇవ్వాల్సిన డబ్బులు ఓట్లప్పుడు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ మోసపు నైజానికి నిదర్శనమన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, నాలుగు వేల నిరుద్యోగ భృతి, ఐదు లక్షల విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2500, వృద్ధులకు రూ.4000 పింఛన్లు, దివ్యాంగులకు రూ.6000 పింఛన్, కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం, రూ.12 లక్షల దళిత బంధు తదితర 420 హామీల అమలును కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని విమర్శించారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 6 నుంచి మండలాలవారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు, చీరాల రమేశ్, కిషన్‌గౌడ్, కార్యదర్శులు బహదూర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, బాషా, జిల్లా నాయకులు రాంరెడ్డి, చక్రవర్తిగౌడ్, విఠల్‌రెడ్డి, యాదయ్య, వెంకటేశ్‌గౌడ్, పుల్లారెడ్డి, చంద్రయ్య, మాజీ ఎంపీపీ కృపేశ్, సొసైటీ చైర్మన్లు రాజేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు భరత్‌రెడ్డి, రవిగౌడ్, సాయికుమార్‌గౌడ్, బద్రీనాథ్‌గుప్తా ఉన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

మున్సిపల్ ప్రత్యేకాధికారి, అడిషనల్ కలెక్టర్ సుధీర్ కుమార్

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్ కుమార్

కొడంగల్, ఫిబ్రవరి 4 : వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అధికారులు పూర్తిస్థాయి చర్యలు ముందస్తుగానే చేపట్టాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి, అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రధానంగా తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంటుందని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు పదవీ కాలం ముగియడం వల్ల అధికారులపై పూర్తి బాధ్యత పెరిగిందని, ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, డీటీ ఈఈ పీఆర్ ఇంజినీరింగ్ సుదర్శన్‌రావు, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీకాంత్, ఎంఈవో రాంరెడ్డి, ఎంపీవో జైపాల్‌రెడ్డి, ఏపీవో రాములు, ఏపీఎం వెంకన్న, వసతి గృహాల వార్డన్‌లు నిర్మల, వరలక్ష్మి, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్ డే సందర్భంగా ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

వికారాబాద్, ఫిబ్రవరి 4 : క్యాన్సర్ వ్యాధి నివారణపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ లక్షణాలు, నివారణ, స్క్రీనింగ్, పరీక్షలు, చికిత్స తదితర వాటి గురించి ఆశాలు, ఏఎన్ఎంలు, సిబ్బంది, గర్భవతులు, తల్లులు, ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ నిరోషా మాట్లాడుతూ.. ఆశా డే, ఆరోగ్య మహిళా సమావేశాల్లో క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు, ఎన్‌సీడీ కార్యక్రమాల గురించి వివరించి లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రవీణ్, శ్రీనివాసులు, రేణుకుమార్, జయరాం, ఎన్‌సీడీ సమన్వయకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షకులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా న్యాయ సేవల అథారిటీ సిబ్బంది వెంకటేశ్, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని డా.వెంకటరమణ వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మలేరియ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర యాదవ్ సమక్షంలో జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, హెల్త్ అసిస్టెంట్లకు రివ్యూ మీటింగ్ నిర్వహించారు. పీహెచ్‌సీల వారీగా ల్యాబ్ టెక్నీషియన్లు 100% టార్గెట్ పూర్తి చేయాలన్నారు. రికార్డులను అప్డేట్ చేయాలని.. మలేరియా, డెంగ్యూ సర్వేలెన్స్ రెగ్యులర్‌గా చేయాలన్నారు. ప్రస్తుతం కొడంగల్, దౌల్తాబాద్, తాండూరు, వికారాబాద్, నవాబుపేటలోని 10 హాబిటేషన్‌లలో పైలేరియా వ్యాధి నిర్మూలనకు నిర్వహిస్తున్న రాత్రి సర్వే (ఎన్‌బీఎస్) పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. రవీంద్రయాదవ్ మాట్లాడుతూ.. ల్యాబ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. జిల్లా స్థాయిలో మలేరియా విభాగం ఎప్పటికీ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, డిప్యూటీ డెమో అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

అక్రమంగా నిర్మిస్తున్న ఫామ్‌హౌజ్‌కు నోటీసులు

కొత్తూరు, ఫిబ్రవరి 4 : అక్రమంగా నిర్మిస్తున్న ఇన్ముల్‌నర్వలోని ఓ ఫామ్‌హౌజ్‌కు పంచాయతీ కార్యదర్శి నర్సింహులు నోటీసులు అందజేశారు. ఇన్ముల్‌నర్వ పరిధిలోని జేపీ దర్గా నుంచి సిద్దాపూర్‌కు వెళ్తున్న రోడ్డులోని ఓ వెంచర్‌లో హైదరాబాద్‌కు చెందిన దేవరబొట్ల మూర్తి అక్రమంగా ఓ ఫామ్‌హౌజ్‌ను నిర్మిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి నర్సింహులు విచారణ చేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్‌హౌజ్‌ను నిర్మిస్తున్నారని నిర్ధారించారు. ఈ మేరకు మూర్తికి మంగళవారం నోటీసులు అందజేశారు. అలాగే అక్రమ నిర్మాణాన్ని ఆపేయాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. లేకపోతే నిర్మాణాన్ని కూల్చివేస్తామని తెలిపినట్లు వివరించారు.

ఇన్ముల్‌నర్వలో అక్రమంగా నిర్మిస్తున్న ఫామ్‌హౌజ్

పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4 : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలతో పాటు పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఓయూ, ఫిబ్రవరి 4: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 15లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 18 వరకు చెల్లించాలని పేర్కొన్నారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 22వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో 24వరకు చెల్లించవచ్చని వివరించారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ, మూడేండ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేండ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కుమెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఎల్ఎల్ఎం పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లా కోర్సుల పరీక్ష ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 12వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఈడీ పరీక్ష ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 12వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్డబ్ల్యూ, ఎంలిబ్ఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

విదేశీ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4 : ఓయూలో చదువుతున్న విదేశీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఓయూ అధికారులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి ఓయూ ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ (ఓఐఏ)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించి, ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటి నుంచి ప్రతి నెలా నాలుగో శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించి, సమస్యలను తెలుసుకుంటామని అధికారులు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులే సమావేశం ఏర్పాటు చేయడంపై విదేశీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ ఎంఏ హమీద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 4 : బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన సామ మహేందర్‌రెడ్డిని నియోజకవర్గం కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీలో చురుకుగా, క్రమశిక్షణగల కార్యకర్తలుగా పని చేస్తే గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీని పటిష్టం చేయడానికి గ్రామగ్రామాన పర్యటించి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. ప్రజలకిచ్చిన మాటలను ప్రభుత్వం కాలదన్నిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ ముదిరాజ్, సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని మంత్రుల నివాసాల ముట్టడి దృశ్యాలు

వీఆర్ఏల ముట్టడి ఉద్రిక్తం

- మినిస్టర్స్ క్వార్టర్స్ వద్ద మంత్రుల నివాసాలను ముట్టడించిన వీఆర్ఏలు
- లోపలికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు, ఇరువర్గాల మధ్య తోపులాట
- మహిళలపై పోలీసుల జులుం..
- ప్రాణం బాగాలేదన్నా వినని పోలీసులు
- వీఆర్ఏలపై దాడిని ఖండించిన బీఆర్ఎస్..

సిటీబ్యూరో/బంజారాహిల్స్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 61 ఏండ్లు నిండిన వీఆర్ఏల వారసులను విధుల్లోకి తీసుకుని ఉద్యోగాలు కల్పించాలని ఇచ్చిన జీవోలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏ జేఏసీ మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్ వద్దకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్దఎత్తున వీఆర్ఏలు, వారి కుటుంబసభ్యులు తరలివచ్చారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని మంత్రుల నివాసాలను ముట్టడికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకున్నది. పోలీసులు వీఆర్ఏలను మినిస్టర్స్ క్వార్టర్స్ వరకు వెళ్లనివ్వకపోవడంతో వారు రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఆ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వీ వాంట్ జస్టిస్ అంటూ వీఆర్ఏలు నినాదాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించేందుకు గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించి వందలాది మంది వీఆర్ఏలు ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పెద్దఎత్తున మోహరించిన బంజారాహిల్స్ పోలీసులు వారిని అడ్డుకున్నా పట్టించుకోకుండా వందలాది మంది వీఆర్ఏలు మంత్రుల క్వార్టర్స్ వద్దకు చేరుకొని లోనికి ప్రవేశించేందుకు యత్నించారు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వారసులకు ఉద్యోగాలివ్వాంటూ పలు డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. తమను విధులోకి తీసుకోకపోగా.. తమ గోడు వెళ్లబోసుకునేందుకు మంత్రులను కలవనీయకుండా అడ్డుకోవడం దారుణ